క్లుప్తంగా

మెరుగైన పారిశుద్ధ్య పనులు

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో పారిశుద్ధ్య లోపాలను ఉపేక్షించేదిలేదని మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తెలిపారు. ఆయన గురువారం పలు వార్డుల్లో మస్టర్ పాయింట్, ఇంటింటా చెత్త సేకరణ, తరలింపు, నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులపై తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది పూర్తిస్థాయిలో విధులకు హాజరై నిర్దేశించిన క్లస్టర్‌లో ఇంటింటా తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నిషేధత ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయిస్తే రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. దుకాణాల ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

ఆకృతి సిల్క్ శారీస్ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న మేయర్ శిరీష

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరం వీవీ మహల్ రోడ్డులోని ఆకృతి సిల్క్ షోరూంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శారీస్ విభాగాన్ని గురువారం మేయర్ శిరీష ప్రారంభించారు. షోరూం ఎండీ సురేష్ మాట్లాడుతూ ఇక్కడ ప్రముఖ కేఎస్ఆర్ హాండ్లూమ్స్ శారీస్ లభిస్తాయని తెలిపారు. తమ షోరూంలో రూ.99ల నుంచి రూ.30 వేల వరకు పట్టు శారీస్, నాణ్యమైన, ఆకర్షణీయమైన శారీస్ అందుబాటులో ఉన్నాయన్నారు. కాంబో పట్టు పేరుతో ప్రత్యేకంగా తలంబ్రాల పట్టు, కంచి పట్టు శారీస్‌ను రూ.5000కే అందిస్తున్నట్లు తెలిపారు. రూ.1500లకు పట్టు శారీతో పాటు వడ్డాణం ప్రత్యేక ఆఫర్ ఇస్తున్నట్లు తెలిపారు. షోరూం ప్రతినిధి పుల్లయ్య పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తిరుపతి కల్చరల్: సాక్షి సీనియర్ డిజైనర్ రమేష్ 3వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు నిరంజన్, సునీల్ గురువారం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. రమేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


ప్రత్యామ్నాయ పంటగా ఉలవ



రైతులకు ఉలవలు అందజేస్తున్న ఎంపీపీ

భాకరాపేట: రైతులు ప్రత్యామ్నాయ పంటగా ఉలవ సాగు చేసుకోవాలని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం.యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం చిన్నగొట్టిగల్లులో రైతులకు ఉలవలు అందజేశారు. తిరుపతి జిల్లా జేడీఏ ప్రసాద్‌రావు మాట్లాడుతూ వర్షాభావం కారణంగా వేరుశనగ పంట సాగు చేయని రైతులకు 80 శాతం రాయితీతో ఉలవలు ఇస్తున్నామని తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలానికి 80 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఏడీఏ ధనుంజయరెడ్డి, ఏవో ధనలక్ష్మీ, సర్పంచ్ మనోహర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ




పాకాల: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలోని 25 మంది పేద విద్యార్థులకు గురువారం పీఓఎస్ఏ (పాకాల ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో యూనిఫాం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు యంపరాల లింగయ్యనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని కళాశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, అసోసియేషన్ ట్రెజరర్ జీ.వి.ప్రసాద్, సుధారాణి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఇంటర్ స్కూల్స్ అథ్లెటిక్స్ ప్రారంభం

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇంటర్ స్కూల్స్ అథ్లెటిక్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆర్గనైజర్ మురళి మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి నింపేందుకు అథ్లెటిక్స్ మీట్‌ను ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా గురువారం 200, 400 మీటర్ల రన్నింగ్, త్రోబాల్ పోటీలు నిర్వహించినట్టు చెప్పారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



చంద్రగిరి: చంద్రగిరి కోట గ్రామానికి చెందిన లీలా కుమార్, జయశ్రీకి వివాహం నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పంపిన పెళ్లి కానుకను గురువారం వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, మహిళా నాయకురాలు గుంటూరు రాజేశ్వరి, ముదికుప్పం రామ్మూర్తి అందజేశారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్ర పటాలకు పాలాభిషేకం

- 22ఏ జీఓతో తిరుపతి నగర అభివృద్ధిని అడ్డుకున్న చంద్రబాబు
- జీఓ రద్దుకు కృషి చేసిన ఎమ్మెల్యే భూమన, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి
- వేల కుటుంబాల వాసుల హర్షం



సుందరయ్యనగర్‌లో సీఎం, టీటీడీ చైర్మన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న పార్టీ నాయకులు, ప్రజలు

తిరుపతి మంగళం: తిరుపతి నగరంలోని అనేక ప్రాంతాల్లోని భూములు, నివాస ప్రాంతాల్లోని భూములు, స్థలాలకు రిజిస్ట్రేషన్లు జరగకుండా గత టీడీపీ హయాంలో చంద్రబాబు తీసుకువచ్చిన 22ఏ జీఓ రద్దుతో ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాయని 38 డివిజన్ కార్పొరేటర్ నరేంద్ర తెలిపారు. 22ఏ జీఓ రద్దు చేసిన సందర్భంగా తిరుపతి సింగాలగుంట ప్రాంతంలో గురువారం కార్పొరేటర్ నరేంద్ర ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నరేంద్ర మాట్లాడుతూ చంద్రబాబునాయుడు 22ఏ జీఓ తీసుకువచ్చి తిరుపతి నగర అభివృద్ధి అడ్డుకున్న ద్రోహి అని దుయ్యబట్టారు. ప్రజలు తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సొంత స్థలాలు, భూములను విక్రయించుకునేందుకు వీలులేకుండా చేశారని వాపోయారు. దీంతో 38వ డివిజన్‌లోని హరిద్వార కాలనీ, సంజయ్‌గాంధీకాలనీ, సింగాలగుంట ప్రాంతాల్లోని సుమారు 2 వేల కుటుంబాల వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారని వివరించారు. తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి 22ఏ జీఓ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రద్దు చేయించారని తెలిపారు. పలువురు స్థానికులు మాట్లాడుతూ ఇబ్బందికరంగా మారిన జీఓను రద్దు చేయించి 2 వేలకు పైగా కుటుంబాల్లో వెలుగులు నింపిన భూమన కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్ చిత్ర పటాలకు పాలతో అభిషేకం చేశారు. అతి చిన్న వయసులోనే తిరుపతి నగరాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం కృషి చేస్తున్న భూమన అభినయ్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగా మోహన్, ఉమామహేశ్వర్, జయప్రద, అమ్ములు, మాధవి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్



మోహన్‌బాబుకు రాఖీ కడుతున్న కొటాల పద్మజ

చంద్రగిరి: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రక్షాబంధన్ వేడుకలు గురువారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. పేగుబంధంతో తోడుగా నిలిచిన అన్నాచెల్లెళ్లు జీవితంలో ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తారనే నమ్మకంతో ఈ పండుగను జరుపుకుంటారు. సోదరుడికి సోదరి హారతి ఇచ్చి కుంకుమ బొట్టు పెట్టి చేతికి రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకుంటుంది. అనంతరం సోదరుడు తన సోదరికి కానుకలు అందజేసి కష్టసుఖాల్లో అండగా ఉంటానని ఆశీర్వదించాడు. ఈ సందర్భంగా మోహన్‌బాబు యూనివర్సిటీ ఛాన్సలర్ మంచు మోహన్‌బాబుకు పలువురు మహిళలు రాఖీలు కట్టారు. రామిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ కొటాల పద్మజ రాఖీ కట్టి ఆయన నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు.

7న గోకులాష్టమి

తిరుపతి రూరల్: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో ఈ నెల 7న గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. టీటీడీ హిందువుల ముఖ్యమైన పండుగల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి ఒకటి. ఇందులో భాగంగా శ్రీకృష్ణ గోలోకాన్ని తలపించే విధంగా టీటీడీ శ్రీవేంకటేశ్వర గోశాలలో ఏర్పాట్లు చేయనుంది. ఈ ఏడాది సందర్శకులు గోశాలలో గోమాతలకు బెల్లం, బియ్యం స్వయంగా తినిపించే అవకాశాన్ని టీటీడీ కల్పిస్తోంది.

కపిలతీర్థంలో..

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయ అనుబంధ వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 7వ తేదీన గోకులాష్టమి వేడుకలను ఘనంగా చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు వేణుగోపాలస్వామి మూలవర్లకు అభిషేకం చేస్తారు. 9.30 గంటల నుంచి భక్తులను సర్వ దర్శనానికి అనుమతిస్తారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామివారికి గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తారు.

ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఆడిటోరియం





ఆడిటోరియంలో పనులను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత, ఓటరు జాబితా సర్వేలో కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న ఆడిటోరియంను సెప్టెంబర్ 3న ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత స్పష్టం చేశారు. ఆమె గురువారం ఆడిటోరియం పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధులు సుమారు రూ.40 కోట్లతో 600 మంది కూర్చునేలా ఆడిటోరియం నిర్మించామన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్, ఆర్ట్ స్టూడియో, డిజైన్ స్టూడియోలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఆడిటోరియం, ఆర్ట్ స్టూడియో పనులు పూర్తయ్యాయని, సెప్టెంబరు 3వ తేదీన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నమన్నారు. మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ దేవిక, ఎయికాం సంస్థ ప్రతినిధి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితా సర్వే తనిఖీ

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో చేపట్టిన ఓటరు జాబితా సర్వేను గురువారం తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తనిఖీ చేశారు. డబుల్ ఎంట్రీలు, చనిపోయిన, మరొక ప్రాంతానికి తరలిపోయిన, వలస పోయినందున తొలగించిన ఓటర్ల గురించి ఆరా తీశారు. ఎన్నికల విధులు జాగ్రత్తగా నిర్వహించాలని, ఓటర్ల జాబితాలో పొరపాట్లు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ వెంకటరమణ, ఈడీటీ జీవన్ కుమార్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు సంస్కృతం అవసరం



మాట్లాడుతున్న వీసీ రాణి సదాశివమూర్తి

తిరుపతి సిటీ: సమాజ శ్రేయస్సుకు సంస్కృత భాష నేర్చుకోవడం ఎంతో అవసరమని ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ వీసీ ఆచార్య రాణి సదాశివమూర్తి తెలిపారు. వర్సిటీలో గురువారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని విశ్వ సంస్కృత భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1956లో కేంద్ర ప్రభుత్వం నియమించిన సంస్కృత కమీషన్ శ్రావణ పౌర్ణమిని సంస్కృత భాషా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. సంస్కృత వా/ఙ్మయంలో ఖగోళ, వైజ్ఞానిక అంశాలు దాగి ఉన్నాయని తెలిపారు. త్వరలో టీటీడీ అనుబంధ 150 వేద పాఠశాలలతో ప్రతి ఏటా వేద పరీక్ష పరిషత్ ద్వారా వేద సమ్మేళనంను నిర్వహిస్తామన్నారు. సంస్కృత భాషను ప్రతి విద్యార్థీ అభ్యసించి మరికొంత మందికి నేర్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు వేదాంతాక్షిరి, శోకాంత్యాక్షిరి, సంస్కృత శ్లోక పఠనం, సుభాషిత శ్లోకాల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ శివ సుబ్రహ్మణ్యం అవధాని, రిజిస్ట్రార్ రాధేశ్యామ్, టీటీడీ చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేష శైలేంద్ర, ఆచార్య గోలి సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాలో 612 మంది అభ్యర్థుల ఎంపిక



మేయర్‌ను సత్కరిస్తున్న తమ్మినేని వెంకటేశ్వర్లు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి కల్చరల్: తిరుపతి భవానీనగర్ సర్కిల్‌లోని గేట్ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 612 మంది ఉద్యోగాలు సాధించినట్లు ఆ కళాశాల చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందులో మేయర్ శిరీష ముఖ్య అతిథిగా పాల్గొని జాబ్‌మేళాను ప్రారంభించారు. ఉద్యోగ అవకాశాల సాధనలో మెళకువలను వివరించారు. మేళాలో అమరాజా, యంగ్ మైండ్స్, ముత్తూట్, మణిపూర్ ఫైనాన్స్, ఏసీటీ ఫైబర్ నెట్, శ్రీరామ్ లైఫ్, అపోలో హెల్త్ కేర్, కలర్ షైన్ ఇండియా, ఎయిర్‌టెల్, టీవీఎస్ సర్వీస్, స్టాండర్ట్ బ్యాంక్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు చేశారు. ఆర్గనైజర్ అయ్యలరెడ్డి, కిరణ్‌బాబు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల: మహా జాబ్ మేళాలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన మహా జాబ్ మేళాకు 32 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. పాకాల డిగ్రీ కళాశాల నుంచి 60 మంది విద్యార్థులు జాబ్ మేళాకు హాజరయ్యారని, 20 మంది ఉద్యోగాలు పొందారని వివరించారు. జేకేసీ సమన్వయకర్త ఎస్.వి.రమేశ్‌కుమార్ ఇచ్చిన శిక్షణ విద్యార్థులకు బాగా ఉపయోగపడిందన్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. మోహన్‌బెహారా, రమణమ్మ, వినోద్, మాధవి పాల్గొన్నారు.


అలరించిన జానపద గీతాలాపన

తిరుపతి కల్చరల్: ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మంజుల కళానిధి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో తిలక్ రోడ్డులోని మంజుల కళా నృత్యాలయంలో జానపద కళాకారులు ఆలపించిన జానపద గీతాలాపన ప్రేక్షకులను అలరించింది. తిలక్ రోడ్డులో ఏర్పాటు చేసిన మంజుల కళా నృత్యాలయాన్ని జానపద నృత్య దర్శకుడు భానుకుమార్ ప్రారంభించారు. జానపద కళాకారులు కె.రెడ్డెప్ప, సుజాత, శ్యామల జానపద గీతాలను ఆలపించి సభికులను రంజింపజేశారు. తర్వాత నృత్య దర్శకుడు భానుకుమార్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు.

సంచార జాతుల విముక్తి దినోత్సవం

తిరుపతి కల్చరల్: అఖిల భారత సంచార జాతుల అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో గురువారం యూత్ హాస్టల్‌లో అఖిల భారత 71వ సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలి రాష్ట్ర అధ్యక్షుడు అన్నారెడ్డి వెంకట్ మాట్లాడుతూ అణగారిన సంచార జాతుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. ట్రైబల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్ సాహెడ్, కార్యవర్గ సభ్యులు ఆర్.దోలాకృష్ణ, చిత్తరంజన్, జిల్లా నాయకులు పగడాల ప్రసాద్, గంగాధరం, పవన్ పాల్గొన్నారు.







టీటీడీ చైర్మన్ భూమనను అభినందిస్తున్న పాండిచ్చేరి మంత్రి లక్ష్మీనారాయణ, రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్, టీటీడీ పాలకమండలి సభ్యుడు తిప్పేస్వామి

టీటీడీ చైర్మన్‌కు అభినందనలు

తిరుపతి మంగళం: టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని గురువారం పలువురు అభినందించారు. పాండిచ్చేరి పర్యాటకశాఖ మంత్రి లక్ష్మీనారాయణ, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్, టీటీడీ బోర్డు సభ్యుడు తిప్పేస్వామి కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

డివిజన్ అధ్యక్షులు, పట్టణ కన్వీనర్ల నియామకం







నంగా కపిలేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, హరిప్రసాద్‌రెడ్డి







గుండ్లూరి సురేష్, లింగయ్యనాయుడు, రఘుపతి

పాకాల: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షులు, పట్టణ కన్వీనర్లను నియమించినట్లు మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి తెలిపారు. పాకాలకు నంగా కపిలేశ్వర్ రెడ్డి, దామలచెరువుకు భాస్కర్‌నాయుడు, మొగరాలకు హరిప్రసాద్‌రెడ్డి, నేండ్రగుంటకు గుండ్లూరి సురేష్‌ను డివిజన్ అధ్యక్షులుగా నియమించినట్లు వివరించారు. అలాగే పాకాల-1, పాకాల-2లకు యంపరాల లింగయ్యనాయుడు, దామలచెరువు-1, దామలచెరువు-2కు రఘుపతిని పట్టణ కన్వీనర్లుగా నియమించామన్నారు. వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

అన్ని భాషలకు తల్లి సంస్కృతమే



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి

తిరుపతి సిటీ: ప్రపంచంలోని అన్ని భాషలకు సంస్కృతం తల్లివంటిదని గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల సంస్కృత అధ్యాపకుడు కోటీశ్వరయ్య తెలిపారు. కళాశాలలో గురువారం సంస్కృత భాషాదినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది శ్రావణ పౌర్ణమి రోజున సంస్కృత భాషా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. ప్రపంచ భాషల్లో సంస్కృతం ప్రాచీనమైనదని, అతి మధురమైన భాష అని కొనియాడారు. వేదానికి ఓంకారం, మానవజన్మకు మాతృమూర్తి లాగానే భారతీయులకు సంస్కృతం అంతే ప్రధానమైనదన్నారు. పాశ్చాత్య దేశాలు ప్రస్తుతం సంస్కృతం వైపు మొగ్గు చూపుతున్నాయని తెలపారు. భారతీయులందరూ సంస్కృత విద్యను అభ్యసించాలని కోరారు. అనంతరం నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎస్.వేణుగోపాల్ రెడ్డి బహుమతులు, పుస్తకాలు అందజేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని గురువారం రాష్ట్ర మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ భరత్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ, ప్రసాదాలతో సత్కరించారు.

ఎస్వీయూ ప్రొఫెసర్‌కు ఫెలోషిప్ అవార్డు

తిరుపతి సిటీ: ఎస్వీయూ బయోకెమిస్ట్రీ విభాగపు సీనియర్ అధ్యాపకులు ఎస్‌డీఎస్ మూర్తి ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రికల్చర్ బయోకెమిస్ట్రీ వారిచ్చే ఫెలోషిప్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు గురువారం ఆయనకు ఆహ్వానం పంపారు. నవంబర్‌లో జరిగే అంతర్జాతీయ సదస్సులో ఆయన అవార్డును అందుకోనున్నారు. ఆయనను అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు అభినందించారు.

ఆర్టీఏలో ఇద్దరు ఉద్యోగులకు పదోన్నతి

తిరుపతి మంగళం: తిరుపతి జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు రాజశేఖర్, కిషోర్ సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. వారిని గురువారం జిల్లా రవాణాశాఖాధికారి సీతారామిరెడ్డి అభినందించారు. రాజశేఖర్ నంద్యాల రవాణాశాఖ కార్యాలయానికి, కిషోర్ అనంతపురం బదిలీ అయ్యారు.

రాణి లక్ష్మీ నరసింహశాస్త్రి ఉద్యోగ విరమణ

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సుమారు 36 ఏళ్ల పలు హోదాల్లో పనిచేసిన రాణి లక్ష్మీ నరసింహ శాస్త్రి గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను వీసీ కృష్ణమూర్తి, వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి, అధ్యాపకులు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

టీటీడీ బోర్డు సభ్యుడిగా వెంకటసుబ్బరాజు ప్రమాణ స్వీకారం

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడిగా గురువారం జి.వెంకటసుబ్బరాజు తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత టీటీడీ జేఈవో వీరబ్రహ్మం స్వామివారి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేయించారు. స్వామి వారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్: తిరుమలలోని సుదర్శన్ గెస్ట్ హౌస్‌లోని ఒక గదిలో భక్తుల సెల్‌ఫోన్లను చోరీ చేసిన కేసులో సత్యవేడు తంబాశెట్టి వీధికి చెందిన సజ్జ జితేంద్రకుమార్‌కు నెల రోజులు జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. 2017 మార్చి 25వ తేదీ అర్ధరాత్రి సుదర్శన్ గెస్ట్ హౌస్‌లోని 318 గదిలో భక్తులకు చెందిన మూడు సెల్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు తిరుమల సీసీఎస్ పోలీసులు నిందితుడు జితేంద్రకుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

తిరుపతి అర్బన్: మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేద్దామని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గొడపేరు చిట్టిబాబు తెలిపారు. ఆయన గురువారం తిరుపతిలోని సుభాష్‌నగర్‌లో ఉన్న తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మెహతాబ్ రాయ్ ఉత్తర్వుల మేరకు ఎన్‌హెచ్‌ఆర్ఎస్‌జేసీ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా బి.బాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా దేవరపల్లి వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శులుగా ఏ మునికృష్ణ, కే.దేవరాజులు, ఏ.మోహనరూప, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా డీఎం చంద్రకళను నియమించినట్లు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన వారు ఎన్‌హెచ్‌ఆర్ఎస్‌జేసీ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జ్ బి.సర్వేందర్, మెహతాబ్ రాయ్, చిట్టిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా మహాభారత ఉత్సవాలకు ధ్వజారోహణం

రామచంద్రాపురం: మండలంలోని ఎన్ఆర్‌కమ్మపల్లిలో 57వ మహాభారత ఉత్సవాలకు గురువారం వేకువజామున వైభవంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ ద్రౌపదిమాత సమేత పాండవులకు ప్రత్యేక పూజలు చేశారు. భాగవతారిణి సీతాలక్ష్మీ మహాభారత విశిష్టత, వ్యాస జననం, శ్రీకృష్ణ జననం, కంస వధ ఘట్టాలను వీనుల విందుగా ఆలపించారు. అనంతరం ఆలయ ధర్మకర్త రమేష్‌బాబు, గ్రామస్తుల సమక్షంలో ప్రధాన అర్చకులు హరి ఆచారి బృందం శాస్త్రోక్తంగా పలువురికి గణాచార్యులు, బటాచార్యులుగా కంకణధారణ చేశారు.

ఘనంగా ధర్మరాజులు స్వామి ఊరేగింపు

చంద్రగిరి: స్థానిక పాతపేటలో వెలసిన ద్రౌపది సమేత ధర్మరాజులు స్వామి ఊరేగింపును గురువారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. ఈనెల 10వ తేదీ నుంచి మహాభారత ఉత్సవాలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా గురువారం సాయంత్రం ఆలయంలో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సమూర్తులను పట్టణంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ పినపెద్ద విరూపాక్షి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులవివక్షకు దూరంగా ఉండాలి

తిరుపతి అర్బన్: అందరూ కులవివక్షకు దూరంగా ఉండాలని తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. సింగాలగుంట, అంబేడ్కర్ కాలనీ, చెన్నారెడ్డి కాలనీలో గురువారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను తక్కువ చేసి మాట్లాడడం, వారిని ఇబ్బంది పెట్టడం చేయరాదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల నేత ఆర్.ప్రసాద్, అలిపిరి ఎస్ఐ జయచంద్ర, రెవెన్యూ అధికారులు రామచంద్ర, జానీబాషా, కార్పొరేషన్ ఆర్ఐలు జ్యోతి, శశికళ పాల్గొన్నారు.